
జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 84 ॥ బుధవారం ॥ 19-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:35 తిథి సప్తమి రా. 7:22 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం స్వాతి ఉ. 6:41 వరకు తరువాత విశాఖ యోగం బ్రహ్మ తె. 3:35o వరకు కరణం గరజి ఉ. 6:31 వరకు వనిజ రా. 7:22 వరకు వర్జ్యం మ. 12:55 నుండి మ. 2:40 వరకు దుర్ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:44 వరకు రాహుకాలం మ. 12:19 నుండి మ. 1:53 వరకు యమగండం ఉ. 7:37 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:45 నుండి మ. 12:19 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు రా. 11:27 నుండి రా. 1:13 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# గీత, చేనేతకు పింఛన్లు

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

- గీత కార్మికుల సంక్షేమానికి పలు కీలక ప్రకటనలు
- పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని వెల్లడి
- విద్య, సామాజిక న్యాయంతో తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని స్పష్టం

రాష్ట్రంలోని గీత, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. గీత కార్మికులు, చేనేత కార్మికులు రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థలో కీలక భాగమని పేర్కొంటూ, అర్హులైన వారందరికీ సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2





# స్థానిక సంస్థల్లో బీసీలకు 34%

### బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం
### ప్రత్యక్ష పద్ధతిలో పట్టణ ఎన్నికలు
### 55కు పైగా అంశాలపై చర్చ..
### కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర పాలన, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాప్రతినిధ్య వ్యవస్థలో మార్పులకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించిన మంత్రివర్గం అనేక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం సమావేశంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

అమరావతి, ఆగస్టు 18: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కేబినెట్ స్పష్టం చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ సంస్థల్లో 34.50 శాతం, ఇతర స్థానిక సంస్థల్లో 33.50 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయించాలని నిర్ణయించింది. సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం పెంపుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబం ధించి ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో..



# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- 15 రోజుల ప్రత్యేక పరిశీలనకు కమిటీ
- పేదల ఆస్తులకు పూర్తి రక్షణ హామీ
- ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి సమాధానం

హైదరాబాద్, ఆగస్టు 18 (రుద్రన్యూస్) :
22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పును గుర్తించి సరిదిద్దే చర్యలు ప్రారంభించిందని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే వేగంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 కలిపి గత 24 గంటల్లో మొత్తం 34 రిజిస్ట్రేషన్లు (మిగతా 2వ పేజీలో)




# ప్రజా ఉద్యమాలకు పర్యాయపదం గద్దర్

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజా ఉద్యమాలకు ప్రజా గాయకుడు గద్దర్ పర్యాయపదమని, ఆయన ఆశయాలను నిలబెట్టి, ఆయన రగిలించిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి సమష్టి బాధ్యత అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 18 : మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో 'ప్రజా యుద్ధ నౌక గద్దర్' డాక్యుమెంటరీ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గద్దర్ కేవలం ఒక వ్యక్తి కాదని, తెలంగాణలోని అణగారిన, పీడిత ప్రజల గొంతుక అని పేర్కొన్నారు. తన పాటలు, ప్రదర్శనల ద్వారా (మిగతా 2వ పేజీలో)

# భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి

### సామాజిక న్యాయంపై కవిత విమర్శలు




హైదరాబాద్, ఆగస్టు 18
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే మరోసారి భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే "భూలక్ష్మి" పథకం ద్వారా భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి పంపిణీ చేస్తామని ప్రకటించారు. భూమి అనేది పేదలకు (మిగతా 2వ పేజీలో)

# స్వచ్ఛ ఇంధన కేంద్రంగా..

### పెట్టుబడిదారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం



తెలంగాణను స్వచ్ఛ ఇంధన తయారీ కేంద్రంగా, ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవోటెల్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026'ను ఆయన ప్రారంభించారు. 2



# ఉరి రద్దు డిమాండ్‌కు ఎదురుదెబ్బ

### ఉరి విధానానికి సుప్రీం మద్దతు

న్యూఢిల్లీ, ఆగస్టు 18
మరణశిక్ష విధించబడిన దోషులను ఉరి ద్వారా శిక్షించే ప్రస్తుత విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో నొప్పిలేని ప్రత్యామ్నాయ పద్ధతిని అమలు చేయాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. భారతీయ శిక్షా విధానంలో ప్రస్తుతం అమలులో ఉన్న ఉరి శిక్ష విధానాన్ని (మిగతా 2వ పేజీలో)

# 10 వేల సంతకాల పిటిషన్‌పై సభలో గంటపాటు చర్చ జరపాలి

### ధర్నాల్లో లేవనెత్తే సమస్యలపైనా మండలిలో ప్రత్యేక చర్చ.. తీన్మార్ మల్లన్న ప్రతిపాదన




హైదరాబాద్, ఆగస్టు 18 :ప్రజల సమస్యలు నేరుగా చట్టసభ చర్చకు వచ్చేలా తెలంగాణ శాసన మండలి నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రతిపాదించారు. ఏదైనా ప్రజా సమస్యపై కనీసం 10 వేల మంది సంతకాలతో ఈ-పిటిషన్ వస్తే శాసన మండలిలో కనీసం గంటపాటు చర్చ జరిపే విధానం తీసుకురావాలని సూచించారు. తెలంగాణ శాసన మండలి కమిటీ హాల్‌లో మంగళవారం చైర్మన్ గుత్తా (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: కీలక వ్యవహారాలు అనుకూలిస్తాయి. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటాబయటా పరిస్థితులు అనుకూలిస్తాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి.

వృషభం: కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. కుటుంబ పెద్దలతో ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

మిధునం: ప్రముఖుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. వాహన అనుకూలత కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు.

సింహం: సన్నిహితులు, మిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

కన్య: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. శ్రమతో కానీ కొన్ని పనులు పూర్తి కావు. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

తుల: గృహమునకు చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

వృశ్చికం: కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. బంధు మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆర్థిక పరంగా ఒత్తిడులు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

ధనస్సు: కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి.

మకరం: సన్నిహితుల నుంచి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణాల నుండి బయటపడగలుగుతారు.

మీనం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.



# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో క్షేత్రస్థాయి లో కొన్ని సాంకేతిక పొరపాట్లు చోటుచేసుకున్నాయని, వాటిని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతోందన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు తీర్పులు పొందిన స్థలాలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న భూములు కూడా పొరపాటున 22ఏ జాబితాలో చేరాయని చెప్పారు. ఈ సమస్యను గుర్తించిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునరుద్ధరించి బాధితులకు ఉపశమనం కల్పించామని తెలిపారు. సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రధాన కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదవారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు.

# ఉరి రద్దు డిమాండ్‌కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కాలం చెల్లినదిగా పేర్కొంటూ దానిని మార్చాలని పిటిషనర్ కోరారు. అయితే ఈ అంశంపై ఇదే తుది నిర్ణయం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భవిష్యత్తులో కొత్త శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం లేదా మరణశిక్ష అమలుకు సంబంధించి మెరుగైన విధానాలు అందుబాటులోకి వస్తే వాటిని పరిశీలించే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం దాఖలైన రిట్ పిటిషన్‌ను మాత్రమే కొట్టివేస్తున్నామని, అవసరమైతే రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని భవిష్యత్తులో పరిశీలించవచ్చని తెలిపింది. మరణశిక్ష అమలుకు సంబం ధించి శాస్త్రీయంగా మరింత అనుకూలమైన విధానాలను పరిశీలించడంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రభుత్వం తగిన నిపుణుల అభిప్రాయాలు, పరిశోధనలు, అంతర్జాతీయ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవచ్చని సూచించింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 354(5) ప్రకారం ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన కోర్టును ఆశ్రయించారు. అనేక దేశాలు ఉరికి బదులుగా ఇతర పద్ధతులను అనుసరిస్తున్నాయని, భారతదేశం కూడా ప్రత్యామ్నాయ విధానాలపై ఆలోచించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరణశిక్ష అమలులో భాగంగా ప్రాణాంతక ఇంజెక్షన్‌ను ప్రత్యామ్నాయంగా పరిగణించాలని పిటిషనర్ తరఫు వాదనలు వినిపించబడ్డాయి.

# గీత, చేనేత కార్మికులకు పింఛన్లు

హైదరాబాద్, ఆగస్టు 18

గీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామని, ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గీత వృత్తి తరతరాలకు కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలక్రమేణా ఈత, తాటి చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో వృత్తిపై ప్రభావం పడుతోందని పేర్కొంటూ, నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్ల వెంట ఈత, తాటి మొక్కలను విస్తృతంగా నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించినట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా గీత కార్మికుల జీవనాధారాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ బహుజన సమాజ గర్వకారణమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడు పాపన్న అని అన్నారు. బహుజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, తెలంగాణకు వచ్చే ప్రతి ఒక్కరూ పాపన్న చరిత్రను తెలుసుకోవాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. నెక్లెస్ రోడ్ పరిసరాల్లో స్వయంగా స్థలాన్ని పరిశీలించి ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశామని చెప్పారు. గణేష్ నిమజ్జనాలు, పర్యాటక సందర్శనల సమయంలో లక్షలాది మంది ఈ విగ్రహాన్ని చూసి స్ఫూర్తి పొందుతారని అభిప్రాయపడ్డారు. ముదిరాజ్ సమాజానికి చెందిన మహాయోధుడు పండుగ సాయన్న సేవలను కూడా ప్రభుత్వం గుర్తిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో బహుజన నాయకుల పాత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా కార్యరూపంలో కనిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే బీసీ కులగణన నిర్వహించామని, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేశామని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాలకు తగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కులవృత్తులను గౌరవించాలే గానీ, పిల్లల భవిష్యత్తు కోసం వారిని తప్పనిసరిగా చదివించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పేద కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నాణ్యమైన విద్య అవసరమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఏటీసీల్లో చేరే యువతకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని, విద్య కోసం ఎంత నిధులు అవసరమైనా వెనుకాడబోమని హామీ ఇచ్చారు. తెలంగాణను సామాజిక న్యాయం, సమాన అవకాశాల రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బహుజన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గీత, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, రైతులు సహా ప్రతి వర్గం సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, స్వాభిమానంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తి మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పేరుతో మాట్లాడుతున్నప్పటికీ ఆచరణలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సంకల్ప సభ తర్వాతే ప్రభుత్వం ఈ అంశంపై మాట్లాడడం ప్రారంభించిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు. భూ విధానాలపై కూడా కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, పేదల భూముల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూముల వినియోగంపై పారదర్శకత లేదని, భూములకు సంబంధించిన విధానాలు పేదలకు నష్టం కలిగించేలా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న భూమి వనరులను సమర్థంగా వినియోగిస్తే భూమిలేని కుటుంబాలకు భూమి పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, ఇతర అందుబాటులో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. భూమి పంపిణీ ద్వారా గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సామాజిక సమానత్వం కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. బీసీలు, మైనార్టీలు, మహిళలు, ఆదివాసీలు, దళితులకు తగిన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆస్తుల పంపిణీ ద్వారా కూడా సామాజిక న్యాయం సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూమి ఉన్న కుటుంబాలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని, అదే అవకాశాన్ని పేదలకు కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకాన్ని అమలు చేసి ప్రతి భూమిలేని పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి అందిస్తామని కవిత పునరుద్ఘాటించారు. సామాజిక న్యాయం కోసం ప్రజలు, మేధావులు, సామాజిక సంస్థలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పేదల భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, భూమి పంపిణీ ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

# స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, ఆగస్టు 18

ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి హాజరైన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను ఉద్దేశించి మాట్లాడిన భట్టి, తెలంగాణ పెట్టుబడిదారులకు స్వర్గధామంలాంటి రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఇంధన రంగంలో మార్పు అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి విధానంలో మార్పు కాదని, అది మొత్తం ఆర్థిక వ్యవస్థను మార్చే పరివర్తన ప్రక్రియ అని భట్టి విక్రమార్క వివరించారు.

తెలంగాణను కేవలం స్వచ్ఛ ఇంధన వినియోగదారుగా కాకుండా, స్వచ్ఛ ఇంధన సాంకేతికతల తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా సమన్వయం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని భట్టి వెల్లడించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధిలో విద్యుత్ నిల్వ వ్యవస్థలు కీలకమని పేర్కొంటూ, బ్యాటరీ నిల్వ కేంద్రాలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ సామర్థ్యాన్ని సాధించాలని రాష్ట్రం ప్రణాళిక రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ ఐటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో సాధించిన ప్రగతిని విద్యుత్ రంగంలోనూ వినియోగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతిపాదిత 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధస్సు డేటా కేంద్రానికి ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం కలయికతో తెలంగాణ కొత్త అభివృద్ధి నమూనాను సృష్టించనుందని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 34%

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ నివేదికపై కూడా మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. కమిషన్ సూచనల ప్రకారం 34 శాతం రిజర్వేషన్ల లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కొన్ని సాంకేతిక, చట్టపరమైన సవాళ్లు ఉన్నట్లు సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి తుది నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిసింది. మరో కీలక నిర్ణయంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల విధానంలో మార్పుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, చైర్‌పర్సన్లను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానాన్ని అమలు చేయనున్నారు. ప్రజలకు నేరుగా నాయకులను ఎన్నుకునే అవకాశం కల్పించడం ద్వారా స్థానిక పాలన మరింత జవాబుదారీతనంతో ముందుకు సాగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు, పరిపాలనా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన దాదాపు 55కు పైగా అజెండా అంశాలను పరిశీలించారు. వివిధ శాఖల ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# 10 వేల సంతకాల పిటిషన్‌పై సభలో గంటపాటు చర్చ జరపాలి

మొదటి పేజీ తరువాయి

సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన రూల్స్ కమిటీ ప్రాథమిక సమావేశం జరిగింది. సమావేశంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌తో పాటు రూల్స్ కమిటీ సభ్యుడైన తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్రబిందువుగా ఉండాలని, వారి సమస్యలు నేరుగా శాసన వ్యవస్థ దృష్టికి వచ్చేలా 'డైరెక్ట్ డిబేట్' విధానం అవసరమన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎలక్ట్రానిక్ పిటిషన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఒక ప్రజా సమస్యపై 10 వేల మంది పౌరుల మద్దతుతో పిటిషన్ వస్తే దానిని స్వీకరించడంతో సరిపెట్టకుండా, సభలో నిర్దిష్ట సమయం కేటాయించి చర్చించాలని సూచించారు.

## ప్రజా ఉద్యమాలకు పర్యాయపదం గద్దర్

మొదటి పేజీ తరువాయి

వివిధ ప్రజా ఉద్యమాల్లో లక్షలాది మందిని కదిలించి, ఏకం చేసిన గద్దర్ తెలంగాణ చరిత్రపై చెరగని ముద్ర వేశారని అన్నారు. తనతోపాటు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కూడా గద్దర్ అంటే ఎంతో అభిమానమని గుర్తుచేశారు. గద్దర్ గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం 'గద్దర్ సినీ అవార్డులు' ఏర్పాటు చేసిందని తెలిపారు. గద్దర్ జీవితంపై డాక్యుమెంటరీ రూపొందిస్తున్న ఆయన కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలతోపాటు నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక బృందం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. గద్దర్ జీవితంలోని అనేక మందికి తెలియని అంశాలతోపాటు వివిధ ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర, ఎదుర్కొన్న కష్టాలు, చేసిన త్యాగాలను ఈ డాక్యుమెంటరీ వెలుగులోకి తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గద్దర్ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు ఇటువంటి ప్రయత్నం దోహదపడుతుందని చెప్పారు.

శ్వేత
సంపాదకీయం
బుధవారం 19-8-2026

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్‌ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷–రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు.

ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు.

పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూపోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి.

దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

## ప్రధాని నోట మాటరావడం ఆలస్యం.. సోషల్ మీడియాలో ఉత్పన్నం



న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు.



# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

## ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

# ఉరిశిక్షను రద్దు చేయండి

## ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి

### సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో

రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.



# 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

న్యూఢిల్లీ,ఆగస్ట్18: ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జిత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్ద వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జిత్ దల్లేవాల్ హర్యానా– పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహిం చాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 29న రాజధా నిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుం దని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.






# పి.ఎం.రాహత్ పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలి.. .జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి.రాజశేఖర్ బాబు**

విజయవాడ: ఆగస్టు 18, 2026.

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.ఎం. రాహత్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.లి ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ.1,50,000 వరకు నగదు రహిత చికిత్స పొందే అవకాశం ఉందని, అత్యవసర సమయంలో డబ్బు కోసం వేచి ఉండకుండా బాధితుడికి తక్షణ వైద్యం అందేలా ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన మంగళవారం జిల్లాస్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**లిప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి వెంటనే నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స అందించేందుకు పి.ఎం. రాహత్ పథకంను కేంద్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 13న ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద ప్రతి ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ.1,50,000 వరకు నగదు రహిత చికిత్స అందించే అవకాశం ఉ ఒదన్నారు.ఈ పథకం నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా 7 రోజుల వరకు ఈ వైద్య ప్రయోజనం వర్తిస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందేలా చూడటమే పథకం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.డబ్బు లేకపోవడం వల్ల అత్యవసర చికిత్స ఆలస్యం కాకుండా చూడటంతో పాటు, ప్రమాద బాధితుడి ప్రాణాలను కాపాడేందుకు తక్షణ వైద్య సహాయం అందేలా ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

**గుడ్ సమారిటన్లకు రూ.25,000 ప్రోత్సాహకం**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణ సహాయం అందించి, ప్రమాదం జరిగిన ఒక గంటలోపు ఆసుపత్రికి చేర్చే వ్యక్తిని 'గుడ్ సమారిటన్'గా గుర్తించడం జరుగుతుంది అన్నారు. ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తరలించడం, అంబులెన్స్ లేదా పోలీసులకు సమాచారం అందించడం, అవసరమైన అత్యవసర సహాయం అందించడం వంటి చర్యలు చేపట్టే వ్యక్తులు ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. అర్హత కలిగిన గుడ్ సమారిటన్‌కు ప్రభుత్వం రూ.25,000 ప్రోత్సాహకం అందించే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితుడికి సహాయం చేయడానికి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సదుద్దేశంతో ప్రమాద బాధితుడికి సహాయం చేసే గుడ్ సమారిటన్లకు అనవసరమైన న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు.బాధితుడిని ఆసుపత్రిలో చేర్చి అవసరమైన సమాచారాన్ని అందించిన తర్వాత గుడ్ సమారిటన్ అక్కడి నుంచి వెళ్లిపోవచ్చని, ప్రమాద బాధితుడికి సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

2026 జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో 583 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం తగ్గిందని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలు జరగడానికి ముందే కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన ఇంజినీరింగ్, ట్రాఫిక్, పోలీసు చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో రహదారి పరిస్థితులు, వెలుతురు, సిగ్నలింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వేగ నియంత్రణ వంటి అంశాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ సమయాల్లో ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీ, రవాణా, ఫైర్, పోలీస్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత అన్నారు. నగరంలోని ఒక హోటల్ వద్ద పార్కింగ్ కారణంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రజా రవాణాకు అంతరాయం కలిగించే విధంగా పార్కింగ్ నిర్వహిస్తున్న సదరు హోటల్ ట్రేడ్ లైసెన్స్‌ను నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రహదారి భద్రతను సామూహిక బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఇది ఎంతో బాధాకరమైన విషయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ రహదారి భద్రతా నిబంధనలను పాటించాలని సూచించారు.



# 34 % రిజర్వేషన్లు.. రమాదేవికి ఎమ్మెల్సీ బీసీ చరిత్రలో సువర్ణధ్యాయం

**34 శాతం బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణ హర్షణీయం**

**బీసీలకు ఒకే రోజు రెండు పండుగలు: కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, ఆగస్టు 18 : ఈ రోజు రాష్ట్ర బీసీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పాటు ఈ బిల్లుపై అసెంబ్లీలో చర్చ జరగడం ముదావహమన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో బీసీలకు నిజమైన రాజ్యాధికారం కల్పించినట్లైందన్నారు. రిజర్వేషన్ల పెంపు మాట నెరవేర్చిన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు, మంత్రి నారా లోకేశ్ గారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ అంటే తెలుగుదేశం.. తెలుగుదేశం అంటే బీసీ అని. బీసీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి కొండపల్లి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు 34 నుంచి 24 శాతానికి తగ్గించిందని.. 10 శాతం రిజర్వేషన్లు తగ్గడంతో బీసీలు ఎన్నో పదవులు కోల్పోయారన్నారు. గత వైసీపీ పాలనలో బీసీలు రాజకీయంగానే కాకుండా అన్ని విధాలా అణిచివేతకు గురయ్యారని మంత్రి విమర్శించారు. యువగళం పాదయాత్రలో బీసీలకు జరిగిన అన్యాయం తెలుసుకున్న నారా లోకేష్ గారు దీనిని సరి చేస్తానని హామీ ఇచ్చినట్టుగానే ఈ రోజు బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. గత 40 ఏళ్లలో ఎందరో బీసీ రాజకీయ యోధులను తయారు చేసిన రాజకీయ ఖార్ఖానా తెలుగుదేశం అని మంత్రి తెలిపారు. బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పునరుద్ధరించిన రోజే బీసీ వర్గానికి చెందిన సాధారణ అంగన్వాడీ మహిళ దళవాయి రమాదేవిని ఎమ్మెల్సీకి ఎంపిక చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఒకే రోజు బీసీలకు రెండు పండగలు వచ్చినట్లైందని మంత్రి తెలిపారు.




# మౌంట్ ఎల్బ్రస్‌పై త్రివర్ణ పతాకం..

**ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్!.. ఏలూరు రూరల్ ఎస్సై వెంకటేశ్వరరావు ప్రతిభ**

ఏలూరు, ఆగస్టు 18, రష్యాలోని 5,642 మీటర్ల ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని అధిరోహించి, 100 మీటర్ల భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏలూరు రూరల్ ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావు స్థానం సాధించారు. వెంకటేశ్వరరావు మంగళవారం ఏలూరు జిల్లాకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ పురవీధులలో ఓపెన్ టాప్ కారులో స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఎస్సై వెంకటేశ్వరరావును అభినందించి ఘనంగా సత్కరించారు. వృత్తి నిర్వహణలో బాధ్యతలు నిర్వహించడం తోపాటు అరుదైన రికార్డు సాధించి దేశానికి ఖ్యాతి తెచ్చి పెట్టిన వెంకటేశ్వరరావు ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీ వై. ప్రసాద్ రావు, డీఎస్పీ శిరిడి శ్రావణ్ కుమార్ , పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.






# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ఏలూరు, ఆగస్టు 18

భారత శ్రామిక వర్గం 100 సంవత్సరాల పైబడి పోరాట సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని ఏ ఐ టి యు సి ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాం గే, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ ఐ టి యు సి రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా దేశంలో మార్పు రావాలి-- మార్పు కోరాలి అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ఏలూరు అర్బన్ తహసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నాడు ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు అధ్యక్షత వహించారు. డిప్యూటీ తాసిల్దార్ గాయత్రి కి ఎ ఐ టి యు సి మరియు సిపిఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి శ్రీనివాస్ డాంగే, మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు.

44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ లను రెగ్యులర్ చేయాలని వారు కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు 26000 రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, కనీస వేతన బోర్డును పునరుద్దించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను అరికట్టాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని, 12వ పిఆర్సి కమిషన్ ప్రకటించాలని, ఐ ఆర్ 30 శాతం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల, కార్మికుల హక్కులను హరించి వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తమ విధానాలు విడనాడాలని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి మరియు సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

**కేంద్ర ఆర్థిక మంత్రికి జన్మదిన సందేశం.. ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష.. సోషల్ మీడియా వేదికగా అభినందనలు**



అమరావతి, ఆగస్టు 18 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో నిర్మలా సీతారామన్ పోషిస్తున్న పాత్రను కొనియాడుతూ ఆమెకు ఆయురారోగ్యాలు, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. తన సందేశంలో చంద్రబాబు నాయుడు, "గౌరవనీయ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు అచంచలమైన శక్తితో దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న కృషి మరింత కొనసాగాలని ఆకాంక్షించారు.

నిర్మలా సీతారామన్ భారత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్న కీలక నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పన, ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాల్లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై కూడా భారత ఆర్థిక విధానాలను సమర్థవంతంగా ప్రతినిధ్యం వహిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు మరియు ఇతర ప్రముఖులు నిర్మలా సీతారామన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆమె ప్రజాసేవా దృక్పథం, ఆర్థిక రంగంలో నాయకత్వాన్ని ప్రశంసిస్తూ సందేశాలు పోస్టు చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో కూడా వేలాది మంది ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఆమె అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. మహిళా నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన నిర్మలా సీతారామన్ రాజకీయ, పరిపాలనా రంగాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని పలువురు పేర్కొంటున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, పెట్టుబడుల ఆకర్షణ కోసం నిర్మలా సీతారామన్ చేపడుతున్న చర్యలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.



# ఎస్ఆర్‌బీసీ కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

**జిల్లా కలెక్టర్‌కు కాటసాని వినతి**

**సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు**

**గోరుకల్లు జలాశయం నుంచి నీటి విడుదలకు విజ్ఞప్తి**

**తాగునీటి అవసరాలపైనా దృష్టి పెట్టాలని సూచన**

నంద్యాల, ఆగస్టు 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): గోరుకల్లు జలాశయం నుంచి శ్రీశైలం కుడి శాఖ కాలువ (ఎస్ఆర్‌బీసీ)కు తక్షణమే నీటిని విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన నంద్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఆర్‌బీసీ కాలువపై ఆధారపడిన రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కాలువ పరిధిలోని ఆయకట్టు ప్రాంతాల్లో సాగు చేసిన పంటలకు నీటి అవసరం అత్యవసరంగా ఉందని కాటసాని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకోవడానికి సాగునీటి సరఫరా తప్పనిసరిగా అవసరమని తెలిపారు. ఆలస్యం జరిగితే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

గోరుకల్లు జలాశయంలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పరిశీలించి రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి కాలువలోకి నీటి ప్రవాహం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గాల పరిధిలోని అనేక గ్రామాలు ఎస్ఆర్‌బీసీ కాలువపై ఆధారపడుతున్నాయని కాటసాని వివరించారు. సాగునీటితో పాటు తాగునీటి అవసరాల కోసం కూడా ఈ కాలువ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం అత్యవసరమని పేర్కొన్న ఆయన, నీటి విడుదలపై సానుకూల చర్యలు తీసుకుంటే వేలాది ఎకరాల పంటలకు ప్రాణం పోసినట్లవుతుందని అన్నారు.

# డీఎస్సీ వివాదంతో మండలిలో దుమారం

**వాయిదా తీర్మానంపై వైసీపీ ఆందోళన**

**సభా కార్యక్రమాలకు అంతరాయం**

**ప్రతిపక్ష తీరుపై కేశవ్ విమర్శలు**



అమరావతి, ఆగస్టు 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సమావేశాలు వరుసగా రెండో రోజు కూడా డీఎస్సీ అంశంపై తీవ్ర వాగ్వాదాలు, ఆందోళనల మధ్య కొనసాగాయి. డీఎస్సీ నియామకాల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేయడంతో మండలిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలి ఛైర్మన్ మోషేన్ రాజు అధ్యక్షతన సమావేశం ప్రారంభమైన వెంటనే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై చర్చించాలంటూ వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం సమర్పించారు. అయితే ఆ తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించి ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం వారు ఛైర్మన్ పోడియం వద్దకు చేరుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు మాట్లాడే అవకాశం కల్పించగా, డీఎస్సీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఈ అంశాన్ని వేరే రూపంలో తీసుకురావాలని ఛైర్మన్ సూచించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగించారు. దీనిపై స్పందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సభా సంప్రదాయాలను గౌరవించాలని ప్రతిపక్ష సభ్యులకు సూచించారు. ఛైర్మన్‌ను అగౌరవపరిచే విధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముందుగా చర్చించాలని, అనంతరం డీఎస్సీ అంశంపై కూడా మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

డీఎస్సీ నియామకాల విషయంలో తెలుగుదేశం పార్టీ చరిత్రను ప్రస్తావించిన కేశవ్, తమ ప్రభుత్వాలు గతంలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదని విమర్శించారు. ఇప్పుడు నిరుద్యోగుల పట్ల ఆందోళన వ్యక్తం చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని వ్యాఖ్యానించారు. మరోవైపు, శాసనసభలో చర్చించినట్లుగానే మండలిలో కూడా మెగా డీఎస్సీ అంశంపై ప్రత్యేకంగా చర్చ జరపాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు.



# రైతులకు విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలి

**వైఎస్సార్ జిల్లాలో 1,800 కనెక్షన్లు పెండింగ్**

**విద్యుత్ శాఖకు ఎంపీ అవినాష్ రెడ్డి లేఖ**

**పరికరాల కొరతతో రైతులకు ఇబ్బందులు**

**ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల విడుదలకు విజ్ఞప్తి**

కడప, ఆగస్టు 18: వైఎస్సార్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ పరికరాల కొరత కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సమస్యపై ఫోన్ ద్వారా కూడా అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గత రెండేళ్లుగా అనేక మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త బోర్లు తవ్వించుకున్నప్పటికీ విద్యుత్ సౌకర్యం అందక సాగు పనులు దెబ్బతింటున్నాయని వివరించారు. దీంతో రైతులు అదనపు ఖర్చులు భరిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ వద్ద అవసరమైన సామగ్రి అందుబాటులో లేకపోవడం వల్ల పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితి రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాలను వెంటనే విడుదల చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రైతుల అవసరాలను అత్యవసరంగా పరిగణించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. సాగు సీజన్‌లో విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల పంటల ఉత్పత్తిపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అవినాష్ రెడ్డి కోరారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్ల సమస్యను అత్యవసరంగా పరిష్కరిస్తే వేలాది మంది రైతులకు ఊరట లభిస్తుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై విద్యుత్ శాఖ సానుకూల నిర్ణయం తీసుకుని త్వరితగతిన చర్యలు చేపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కొలుసు పార్థసారథి**



అమరావతి, ఆగస్టు 18 : బీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ సాధికారత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ నిర్ణయం బీసీలకు ఒక వరంలాంటిదని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆయన గుర్తు చేశారు. అనంతరం ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీలకు సమాజంలో సముచిత గౌరవం కల్పించిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. బీసీలకు అన్ని దశల్లో అండగా నిలిచిన చరిత్ర ఆయనదేనని పేర్కొన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో వేలాది మంది బీసీలు స్థానిక సంస్థల పదవులకు దూరమయ్యారని కొలుసు పార్థసారథి ఆరోపించారు.

# బీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి స్వాగతం

**ముఖ్యమంత్రిని కలిసిన ప్రజాప్రతినిధులు**

**బీసీ సాధికారతకు కీలక అడుగు**

అమరావతి, ఆగస్టు 18: స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీసీ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శాసనసభ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీల రాజకీయ సాధికారతకు దోహదపడే నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్న నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీపై ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ఈ నిర్ణయాన్ని బీసీ వర్గాల ప్రతినిధులు చారిత్రాత్మకంగా అభివర్ణించారు. శాసనసభ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో బీసీల భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం పెంపుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో నాయకత్వం మరింత బలపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి మండలి నిర్ణయంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకంగా మారగా, బీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.





# విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలి

కనగల్లు, ఆగస్టు 18 :

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కార్యశాలలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాధికారిణి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు వల్లపట్ల పద్మ అన్నారు. మంగళవారం కనగల్లు మండలంలోని చిన్నమాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో, శాంతా వసంత ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన కార్యశాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్యదశ నుంచే విద్యార్థులకు కథలు చదవడం, రాయడం పట్ల ఆసక్తి కలిగించి, కథా రచనా విధానంపై అవగాహన కల్పిస్తే వారిలో సృజనాత్మక ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రముఖ బాలసాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి మాట్లాడుతూ కథలు చదవడం, రాయడం వల్ల పిల్లల్లో నైతిక విలువలు పెంపొందడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, సంపూర్ణ మూర్తిమత్వానికి ఇటువంటి కార్యశాలలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యశాలలో విషయ నిపుణులుగా పెరుమాళ్ల ఆనంద్, ముక్కాముల జానకిరామ్ పాల్గొని విద్యార్థులకు కథా రచనలోని మెళకువలను వివరించారు. ప్రముఖ బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాధగోని శంకరయ్య, అజాజ్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆధునిక పురుగుమందుల వినియోగంపై అగ్రిటెక్ నిపుణులకు ఎన్ఐపీహెచ్ఎం శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 18 :

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) ఆధ్వర్యంలో షణ్ముఖ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 27 మంది నిపుణులకు ఆధునిక పురుగుమందుల వినియోగ పద్ధతులపై మూడు రోజుల సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుస్థిర పంటల పరిరక్షణపై ప్రధానంగా దృష్టి సారించిన ఈ కార్యక్రమంలో ఆధునిక స్ప్రేయింగ్ పద్ధతులు, స్ప్రేయర్ కాలిబ్రేషన్, నాజిల్ ఎంపిక, నిర్వహణ, ఆపరేటర్ల భద్రత, పురుగుమందుల విషతత్వం, నేల ఆరోగ్యం, సమగ్ర పురుగు-వ్యాధుల నిర్వహణతోపాటు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్‌లోని సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్ లేబొరేటరీని సందర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అక్కడ పాల్గొన్న వారికి నేల సారవంతత నిర్వహణ, పంటల ఉత్పాదకతను సుస్థిర పద్ధతుల్లో పెంచేందుకు అనుసరించాల్సిన విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ అయిన ఎన్ఐపీహెచ్ఎం ఈ శిక్షణ ద్వారా నిపుణుల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం, పురుగుమందుల బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించడం, సురక్షిత వ్యవసాయం, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి తోడ్పడటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.



# దేశభక్తి గీతాలతో అలరించిన భారత వైమానిక దళ బ్యాండ్

హైదరాబాద్, ఆగస్టు 18 :

దేశభక్తి, సంగీత ప్రతిభను మేళవిస్తూ భారత వైమానిక దళానికి చెందిన నంబర్-3 బ్యాండ్ సికింద్రాబాద్ బైసన్ పోలో గ్రౌండ్‌లో అద్భుతమైన సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించింది. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ హకీంపేట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. దేశభక్తి గీతాలు, సైనిక సంగీత స్వరాలు, ప్రజాదరణ పొందిన మెలోడీలను బ్యాండ్ ప్రదర్శించింది. సంప్రదాయ సైనిక బ్యాండ్ సంగీతానికి ఆధునిక సంగీత అమరికలను జోడిస్తూ ఆకట్టుకుంది. సీనియర్ వైమానిక దళ అధికారులు, పౌర ప్రముఖులు, స్థానిక ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. సాయుధ దళాలు, ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ముగిసిన అనంతరం ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో వైమానిక దళ సిబ్బందిని అభినందించారు. దేశభక్తి, జాతీయ ఐక్యత, స్వావలంబన భారత స్ఫూర్తిని ప్రతిబింబించిన సంగీత నివాళి అందరినీ ఆకట్టుకుంది.

# పాపన్న పోరాట స్ఫూర్తితో తెలంగాణలో బీసీల రాజ్యం

## ఆయన ఆశయ సాధనే మా లక్ష్యం: టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



హైదరాబాద్, ఆగస్టు 18 :

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో తెలంగాణలో బీసీల రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పనిచేస్తుందని పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తీన్మార్ మల్లన్న పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన వర్గాల ఆత్మగౌరవం కోసం సర్వాయి పాపన్న చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. నాటి సామాజిక పరిస్థితుల్లో ఆధిపత్య శక్తులను ఎదిరించి బహుజన రాజ్య స్థాపనకు పునాదులు వేసిన పోరాట యోధుడు పాపన్న అని కొనియాడారు. పాపన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని బీసీలను రాజకీయంగా, సామాజికంగా ఐక్యం చేస్తామని, తెలంగాణలో బహుజన రాజ్యాన్ని నెలకొల్పేందుకు నిరంతరం పోరాడతామని తెలిపారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ అధికారంలో సముచిత వాటా దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు సల్మాన్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ, యూత్ ప్రధాన కార్యదర్శి వీరమల్లు అనిల్, స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్, నాయకులు బయ్య వెంకటేష్ యాదవ్, భాను తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఓట్లతో గెలిచి.. బీసీలనే మోసం చేస్తారా?

## రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న సవాల్

## కొడంగల్‌లో 57.45 శాతం బీసీ ఓటర్లే

## 59 నియోజకవర్గాల్లో బీసీల గెలుపే లక్ష్యంగా 'సర్జికల్ స్ట్రైక్ 59'



హైదరాబాద్, ఆగస్టు 18 :

బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అదే బీసీలకు రాజకీయంగా అన్యాయం చేస్తే ఇక సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల ఓట్లతోనే రాజకీయంగా ఎదిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల రాజ్యాధికారాన్ని అడ్డుకోలేరని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,36,789 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,36,034 మంది బీసీ ఓటర్లు ఉన్నారని, ఇది మొత్తం ఓటర్లలో 57.45 శాతమని మల్లన్న తెలిపారు. రెడ్డి సామాజికవర్గ ఓటర్లు 12,567 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. బీసీల మద్దతు లేకుండా కొడంగల్‌లో రాజకీయ బలం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఎన్. వెంకటయ్య, సూర్యనారాయణ వంటి బీసీ నాయకుల రాజకీయ వారసత్వం కొడంగల్‌కు ఉందని గుర్తుచేశారు. జడ్చర్ల నియోజకవర్గంలో 1,37,748 మంది బీసీ ఓటర్లు ఉన్నారని, మొత్తం ఓటర్లలో వారి వాటా 62.47 శాతమని తెలిపారు. రెడ్డి సామాజికవర్గ ఓటర్లు 10,499 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. ఎర్ర సత్యం వంటి బీసీ నాయకుల రాజకీయ వారసత్వాన్ని టీఆర్పీ ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఎర్రశేఖర్, మధుసూదన్ యాదవ్, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ తదితరులు బీసీ రాజకీయ శక్తికి ప్రతినిధులుగా నిలుస్తున్నారని అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1,57,839 మంది బీసీ ఓటర్లు ఉండగా, రెడ్డి సామాజికవర్గ ఓటర్లు 12,031 మంది మాత్రమే ఉన్నారని మల్లన్న తెలిపారు. దేవరకద్రలోనూ బీసీ ఓటర్ల సంఖ్య రెడ్డి సామాజికవర్గ ఓటర్ల కంటే దాదాపు 13 రెట్లు అధికంగా ఉందన్నారు. బాలకృష్ణ, వర్మ ముదిరాజ్, కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ వంటి బీసీ నాయకత్వం అక్కడ బలంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీసీల ఓట్లు కావాలి కానీ, వారికి రాజ్యాధికారంలో సముచిత వాటా ఇవ్వడానికి మాత్రం పాలకులు సిద్ధంగా లేరని మల్లన్న విమర్శించారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, హక్కులు కల్పించడంతో పాటు కులగణనకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీల రాజకీయ శక్తిని ఏకం చేయడమే లక్ష్యంగా 'సర్జికల్ స్ట్రైక్ 59' వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు మల్లన్న ప్రకటించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 59 స్థానాల్లో బీసీల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. బీసీల ఓట్లను చీల్చి అధికారాన్ని కొద్దిమంది చేతుల్లో ఉంచే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. బీసీలు తమ ఓటు విలువను గుర్తిస్తున్నారని, 'మా ఓటు--మా రాజ్యాధికారం' నినాదంతో రాజకీయంగా ఏకం కావాలని మల్లన్న పిలుపునిచ్చారు. 2028 ఎన్నికలు తెలంగాణలో బీసీల నూతన రాజకీయ శక్తికి నాంది పలుకుతాయని ధీమా వ్యక్తం చేశారు.




పాలిటెక్నిక్ కాలేజీలలో కొత్తగా ప్రవేశపెట్టిన శక్తి కోర్సును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు..

# పాపన్న పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

## చిలుకూరులో ఘనంగా 376వ జయంతి ఉత్సవాలు

చిలుకూరు, ఆగస్టు 18 :

బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి పాలక శక్తులకు ఎదురొడ్డి రాజ్యాధికారాన్ని సాధించిన పాపన్న జీవితం అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా చిలుకూరు మండల కేంద్రంలోని బాపూజీ గ్రంథాలయంలో జై గౌడ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాపన్న గౌడ్ కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, సామాజిక ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్య గౌడ్, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ కడియాల వెంకటేశ్వర్లు గౌడ్, చిలుకూరు కల్లుగీత సొసైటీ అధ్యక్షుడు మరీదు సైదులు గౌడ్, ప్రధాన కార్యదర్శి కొండ శేషయ్య గౌడ్ పాల్గొన్నారు. అలాగే కొండా వెంకటేశ్వర్లు గౌడ్, కొండ వీరబాబు గౌడ్, బాలెబోయిన నరేష్ గౌడ్, యరగాని నాగేంద్ర గౌడ్, యరగాని రాంబాబు గౌడ్, కాలతిరిపి భిక్షం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# రూ.50 వేల లంచం.. ఏసీబీకి చిక్కిన ఇద్దరు అటవీ అధికారులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 18 :

నల్లమల అటవీ ప్రాంతం నుంచి కలప తరలిస్తున్న వ్యక్తి నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించిన ఆరోపణలపై నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల అటవీ కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పట్టుకుంది. నిందితులను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాంబాబు (ఏ-1), ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మురళీకృష్ణ (ఏ-2)గా గుర్తించారు. ఏసీబీ వివరాల ప్రకారం జూలై 23, 2026న ఫిర్యాదుదారుడు మరికొందరితో కలిసి కలపను తరలిస్తుండగా అధికారులు వారిని అడ్డుకున్నారు. లంచం ఇవ్వకపోతే అటవీ కేసు నమోదు చేసి ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకుంటామని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తొలుత రూ.1.20 లక్షలు డిమాండ్ చేయగా, అనంతరం దానిని రూ.50 వేలకు తగ్గించినట్లు ఏసీబీ తెలిపింది. ఫిర్యాదుదారుడు రూ.28 వేలను ఫోన్‌పే ద్వారా, మరో రూ.22 వేలను నగదు రూపంలో చెల్లించినట్లు పేర్కొంది. అనంతరం అధికారిక రసీదు ఇచ్చేందుకు మరో రూ.6 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా, వ్యక్తిగత ప్రయోజనం పొందేందుకు నిందిత అధికారులు అక్రమంగా వ్యవహరించినట్లు ఏసీబీ ఆరోపించింది. ఇద్దరు నిందితులను నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను వెల్లడించలేదు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ 1064 నంబర్‌కు సమాచారం అందించవచ్చని అధికారులు సూచించారు.



# పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

**బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ రామమూర్తి గౌడ్**

**గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**

**సూర్యాపేట, ఆగస్టు 18 :**

తొలి బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామమూర్తి గౌడ్, సంఘం ప్రధాన కార్యదర్శి చిత్తలూరి యాదగిరి గౌడ్ పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 376 సంవత్సరాల క్రితమే పాపన్న బహుజన రాజ్య స్థాపన కోసం పోరాడారని గుర్తుచేశారు. పాపన్న ఒక వ్యక్తి కాదని, బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన శక్తి అని కొనియాడారు. 12 వేల మందితో సైన్యాన్ని నిర్మించి, అనేక కోటలను నిర్మించడంతో పాటు సబ్బండ వర్గాలను ఏకం చేసి బహుజనులకు అధికారం ఉండాలనే ఆకాంక్షను ఆనాడే చాటిచెప్పిన గొప్ప యోధుడు పాపన్న అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా బహుజనుల్లో ఐక్యత కొరవడటం వల్ల వారి ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరడం లేదన్నారు. పాపన్న పోరాట స్ఫూర్తితో అభివృద్ధి, అధికారం, ఆత్మగౌరవం లక్ష్యంగా బహుజనులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బహుజనుల్లో రాజకీయ, సామాజిక చైతన్యం పెరిగినప్పుడే రాజ్యాధికార సాధనకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని గ్రామస్థాయి నుంచి దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశ జనాభాలో బీసీలు అత్యధికంగా ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో వారి జనాభాకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, బహుజన కులాల అభివృద్ధి, చైతన్యం కోసం గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న కో-ఆపరేటివ్ చిట్టి ప్రధాన కార్యదర్శి పబ్బతి వెంకటేశ్వర్లు గౌడ్, గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తండ అంజయ్య గౌడ్, అల్లాడి సత్యనారాయణ గౌడ్, జలగం పురుషోత్తం గౌడ్, గోపగాని సుధాకర్ గౌడ్, అంతటి వెంకన్న గౌడ్, బింగి లక్ష్మయ్య గౌడ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు లింగాల రవి గౌడ్, సురభి శ్రీధర్ గౌడ్, డివిజన్ గౌరవాధ్యక్షుడు చౌగోని వెంకయ్య గౌడ్, మాజీ ఎంఈఓ తండు వెంకటనారాయణ గౌడ్, జయ స్కూల్ లక్ష్మయ్య గౌడ్, సూర్య గౌడ్, మండవ సైదులు, వెంకటేశ్వర్లు గౌడ్, అప్పాల సైదులు గౌడ్, గుండగాని రమేష్ గౌడ్, గిలకత్తుల సైదులు గౌడ్, వేణు, సోమగాని రమేష్ గౌడ్, అనంతుల మల్లేష్ గౌడ్, రాచకొండ సురేష్ గౌడ్, మద్దెల చంద్రమౌళి గౌడ్, వనం యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సుధాకిరణ్‌కు 'గార్డియన్ ఆఫ్ లైఫ్' అవార్డు

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

స్వచ్ఛంద రక్తదానం, సురక్షిత రక్తనిధుల నిర్వహణ, సామాజిక ఆరోగ్య సేవల్లో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా పి.వి. నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ నచ్చురాజు వెంకట సుధాకిరణ్‌కు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతిష్ఠాత్మక 'గార్డియన్ ఆఫ్ లైఫ్ అవార్డు'ను ప్రదానం చేసింది. తెలంగాణలో ప్రజలకు సురక్షితమైన రక్తాన్ని సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంలో ట్రస్ట్ ద్వారా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ముఖ్యంగా హైదరాబాద్, గజ్వేల్‌లోని ట్రస్ట్ రక్త కేంద్రాల ద్వారా వేలాది మంది రోగులకు అవసరమైన రక్తాన్ని అందించడంతో పాటు స్వచ్ఛంద రక్తదానం, దాతల్లో అవగాహన, బాధ్యతాయుత రక్తనిధుల నిర్వహణను ప్రోత్సహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాణాలను కాపాడటం, ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో డాక్టర్ సుధాకిరణ్ చూపుతున్న నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో ఈ అవార్డును అధికారికంగా అందజేశారు.

# శ్రావణం, రాఖీ సందర్భంగా పోస్టల్ శాఖ ప్రత్యేక సేవలు

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

శ్రావణమాసం, రక్షాబంధన్ పండుగలను పురస్కరించుకుని తెలంగాణ పోస్టల్ సర్కిల్ ప్రత్యేక ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గంగోత్రి నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతో పాటు ప్రత్యేక రాఖీ కవర్లను వినియోగదారులకు అందిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా గంగోత్రి నుంచి నేరుగా సేకరించిన పవిత్ర గంగాజలాన్ని 250 మిల్లీలీటర్ల బాటిల్ రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల హెడ్ పోస్టాఫీసులు, ఎంపిక చేసిన పోస్టాఫీసులతో పాటు ఇండియా పోస్ట్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కూడా గంగాజలాన్ని కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. రక్షాబంధన్ సందర్భంగా రాఖీలను సురక్షితంగా పంపేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'రాఖీ పోస్ట్' కవర్లను ఒక్కొక్కటి రూ.15 చొప్పున ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచారు. అలాగే రాఖీ మెయిల్‌కు సంబంధించిన స్పీడ్ పోస్టు ఛార్జీలపై ఆగస్టు 12, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 10 శాతం రాయితీని తెలంగాణ పోస్టల్ సర్కిల్ అందిస్తోంది. ఈ ప్రత్యేక పండుగ సేవలను వినియోగించుకునేందుకు ప్రజలు తమ సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని తెలంగాణ పోస్టల్ సర్కిల్ కోరింది.

# పాపన్న స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలి

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు**

**సూర్యాపేటలో పాపన్న విగ్రహ ఏర్పాటుకు కృషి**

**సబ్బండ వర్గాల నాయకుల తీర్మానం**



**సూర్యాపేట: ఆగస్టు 19**

తొలి బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బడుగు, బలహీన, అణగారిన వర్గాలు ఐక్యంగా ముందుకు సాగి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై. వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా పిలుపునిచ్చారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం సూర్యాపేటలో సబ్బండ వర్గాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు శతాబ్దాలకు పూర్వమే భూస్వామ్య, ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా సైన్యాన్ని నిర్మించి పోరాడిన గొప్ప యోధుడు పాపన్న అని కొనియాడారు. గౌడ సామాజికవర్గంలో జన్మించినప్పటికీ ఆయన పోరాటం ఒక కులానికి పరిమితం కాలేదని, సబ్బండ వర్గాలను ఐక్యం చేసి సామాజిక అసమానతలు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని నింపారని పేర్కొన్నారు. సూర్యాపేట పౌర సమాజం, అన్ని రాజకీయ పార్టీలు, కుల--ప్రజా సంఘాల భాగస్వామ్యంతో కోర్టు చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని వచ్చే జయంతి నాటికి ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఇందుకోసం పార్టీలకతీతంగా అందరినీ కలుపుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మాట్లాడుతూ పాపన్న వంటి మహనీయుడి విగ్రహ ఏర్పాటుకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పాపన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ఆయన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు రాజా, బైరు వెంకన్న గౌడ్ తదితరులు మాట్లాడుతూ పాపన్న విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బూర బాలసైదులు గౌడ్, ఆకుల లవకుశ, కౌన్సిలర్లు బైరు శైలేందర్ గౌడ్, అంగిరేకుల నాగార్జున, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, శనగాని రాంబాబు గౌడ్, కెక్కిరేణి సత్యనారాయణ గౌడ్, గునగంటి వంశీధర్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు చింతలపాటి చిన్న శ్రీరాములు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హస్సేన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు పందిరి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లీశ్వరి, బీజేపీ జిల్లా నాయకుడు చల్లమల్ల నరసింహ, కెక్కిరేణి నాగయ్య గౌడ్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్, అనంతుల మధు, బూర రాములు గౌడ్, భయ్యా మల్లికార్జున్ యాదవ్, బొల్లెద్దు వినయ్, జర్నలిస్టు భూపతి రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల కట్టడికి పోలీసుల విస్తృత తనిఖీలు

**యాంటీ నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో సోదాలు**

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 18 :**

డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులతో పాటు యాంటీ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్, మెయిన్‌రోడ్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లోని టీ దుకాణాలు, పాన్‌షాపులు, విద్యాసంస్థల పరిసరాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన యాంటీ నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో పాన్‌షాపులు, టీ దుకాణాలు, అనుమానిత వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే ప్రధాన జాతీయ రహదారిపై సూర్యాపేట కీలక రవాణా కేంద్రంగా ఉన్న నేపథ్యంలో పట్టణంలో భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంతో పాటు మాదకద్రవ్యాల రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా తనిఖీలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# నకిలీ ఆధార్‌లతో తిరుమల గదులు.. బ్రోకర్ ముఠా గుట్టురట్టు

**తిరుమల, ఆగస్టు 18 :**

నకిలీ గుర్తింపు పత్రాలతో తిరుమలలో వసతి గదులను పొందుతూ, వాటిని భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రోకర్ ముఠా గుట్టును టీటీడీ విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. ఆగస్టు 16న ఇప్పటికే ఒక గది పొందిన వ్యక్తి మరో గుర్తింపుతో తిరిగి క్యూలోకి రావడాన్ని సీఆర్వో సిబ్బంది గుర్తించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అతడిని అదుపులోకి తీసుకుని కేరళలోని మలప్పురానికి చెందిన అషిక్ అలీ పి.ఎం. (32)గా గుర్తించారు. అతడి వద్ద నుంచి రెండు నకిలీ ఆధార్ కార్డులు, గది రిజిస్ట్రేషన్ స్లిప్, రూ.800 నగదు, మొబైల్ ఫోన్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రంజిత్ అనే బ్రోకర్ కోసం తాను పనిచేస్తున్నానని, నకిలీ పత్రాలతో పొందిన ప్రతి గదికి రూ.1,000 చెల్లించేవాడని అషిక్ అలీ వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ ముఠాలోని ఇతర సభ్యులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. టీటీడీ విజిలెన్స్ విభాగం ఫిర్యాదు మేరకు తిరుమల-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధార్ కార్డుల ప్రామాణికతతో పాటు సాంకేతిక ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. భక్తులు బ్రోకర్లను ఆశ్రయించవద్దని, తమ ఆధార్ వివరాలు, ఫొటోలు, ఫోన్ నంబర్లు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు ఇవ్వవద్దని టీటీడీ సూచించింది. వసతి గదులను అధికారిక సీఆర్వో కౌంటర్లు, టీటీడీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారానే పొందాలని విజ్ఞప్తి చేసింది. అనుమానాస్పద కార్యకలాపాలపై టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ 9866898630 లేదా టీటీడీ కాల్‌సెంటర్ 155257కు సమాచారం ఇవ్వవచ్చని తెలిపింది. బ్రోకర్లతో పాటు వారికి సహకరించే వారిపైనా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఫిలిప్పీన్స్ విధానాల అధ్యయనం

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

విదేశీ కార్మికుల వలస విధానం, సంక్షేమ వ్యవస్థలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ ఎన్ఆర్ఐ సలహా కమిటీ ప్రతినిధి బృందం ఫిలిప్పీన్స్‌లో మూడు రోజుల అధ్యయన పర్యటన చేపట్టింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలోని బృందంలో కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఎం. వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీమ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు. మనీలాలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఫిలిప్పీన్స్ అమలు చేస్తున్న కార్మిక వలసల పాలనా విధానం, వలస కార్మికుల సంక్షేమ వ్యవస్థలు, పౌర సమాజ భాగస్వామ్యం, కార్మిక సంఘాల పాత్ర, అంతర్జాతీయ వలస విధానాలను ప్రతినిధి బృందం అధ్యయనం చేసింది. ప్రపంచంలో విజయవంతమైన వలస విధాన వ్యవస్థల్లో ఫిలిప్పీన్స్ ఒకదాన్ని అభివృద్ధి చేసిందని ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గల్ఫ్, ఇతర విదేశీ కార్మికుల సంక్షేమ విధానంలో ఫిలిప్పీన్స్‌లో అమలవుతున్న ఉత్తమ పద్ధతుల్లో అనువైన వాటిని పరిశీలించనున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక తెలంగాణ గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీతో పాటు 'గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ అధ్యయన పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలతో పాటు ఇతర విదేశాల్లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన సుమారు 15 లక్షల మంది కార్మికులకు మరింత మెరుగైన రక్షణ, సంక్షేమం, సహాయక వ్యవస్థలను కల్పించేందుకు ఫిలిప్పీన్స్ అనుభవాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించనున్నట్లు ప్రతినిధి బృందం తెలిపింది.

# ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకు సిమెంట్ ఇవ్వాలి: పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ కంపెనీలు భాగస్వాములు కావాలని, పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకు సరఫరా చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ వ్యయాన్ని తగ్గించే మార్గాలపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవం కల్పించే బృహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 85 శాతం ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. అలాగే క్యూర్ (జఖ=జు) పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా 'ఇందిరమ్మ టవర్స్' ప్రాజెక్టును ప్రారంభించినట్లు చెప్పారు. పేదల గృహ నిర్మాణానికి రూ.5 లక్షలను నూటికి నూరు శాతం సబ్సిడీగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడినా పేదలకు ఇళ్లు అందించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి లబ్ధిదారుడికి ప్రతి సోమవారం విడతల వారీగా పారదర్శకంగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు.

# వర్షాలపై అనిశ్చితి.. నీటి నిర్వహణలో అప్రమత్తత అవసరం: ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

ఎల్‌నినో పరిస్థితులు, మిగిలిన వర్షాకాలంలో వర్షపాతంపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో తాగునీటి అవసరాలకు భద్రత కల్పిస్తూనే రైతుల సాగునీటి అవసరాలను తీర్చేలా సమతుల్య విధానం అనుసరించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జలాశయాల్లో నీటి నిల్వలు, సాగునీటి అవకాశాలపై మంగళవారం జలసౌధలో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే నెలల్లో నీటి నిర్వహణ భవిష్యత్తులో వర్షాలు పడతాయనే ఆశావహ అంచనాలపై కాకుండా, శాస్త్రీయ విశ్లేషణ, వాస్తవంగా అందుబాటులో ఉన్న నీటి పరిమాణం ఆధారంగా జరగాలని స్పష్టం చేశారు. తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, అయితే జలాశయాలు, ఇతర నమ్మకమైన వనరుల్లో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పుడు సాగునీటిని నిలిపివేయడానికి అది కారణం కాకూడదన్నారు. తాగునీటి అవసరాలను పరిరక్షించిన తర్వాత అందుబాటులో ఉండే నీటిని నిలిచిన పంటలకు అందించాలని సూచించారు. ప్రతి నీటి విడుదల వాస్తవంగా వినియోగించుకోగల నిల్వలు, విశ్వసనీయమైన ఇన్‌ఫ్లోలు, వర్షపాతంపై వాస్తవిక అంచనాల ఆధారంగానే ఉండాలని చెప్పారు. కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉందని, ఇది 76.63 శాతమని తెలిపారు. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి గాను 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీటి నిల్వలు ఉన్నట్లు వివరించారు. కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టు నాగార్జునసాగర్‌లో 312 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని, సుమారు 47 శాతం వరద నీటిని స్వీకరించే అవకాశం ఉందన్నారు.

# బాలనటిగా మొదలై.. హాలీవుడ్ స్టార్‌గా!



హైదరాబాద్, ఆగస్టు 18 :

తెలుగులో బాలనటిగా గుర్తింపు పొందిన అవంతిక వందనపు ప్రస్తుతం హాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. తెలుగు, హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. కొంతకాలం తర్వాత మళ్లీ వార్తల్లో నిలుస్తున్నారు.

**హీరోల సినిమాల్లో బాలనటిగా..**

దాదాపు పది తెలుగు చిత్రాల్లో బాలనటిగా కనిపించిన అవంతిక.. 2021లో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఇండో--అమెరికన్ నేపథ్యంతో తెరకెక్కిన 'స్పిన్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషించి మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు అందుకున్నారు.

**'మీన్ గర్ల్స్'తో మరింత పాపులర్..**

'మీన్ గర్ల్స్' సినిమాలో అవంతిక గ్లామరస్ లుక్‌లో కనిపించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. బాలనటిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె హాలీవుడ్‌లో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించడం అందరి దృష్టినీ ఆకర్షించింది.

**రెట్రో పాటతో మళ్లీ సందడి..**

ఇటీవల 'ఛాంపియన్' సినిమా కోసం ఓ రెట్రో పాటలో అవంతిక సందడి చేశారు. అంతేకాకుండా హాలీవుడ్‌లో జరిగిన 'పవర్ ఆఫ్ యంగ్ హాలీవుడ్ ఇంపాక్ట్' కార్యక్రమంలో గ్లామరస్ లుక్‌లో మెరిశారు.





# డీసీ పై అల్లు అర్జున్ ప్రశంసలు

హైదరాబాద్, ఆగస్టు 18 :

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ చిత్రం అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన చిత్రమని అల్లు అర్జున్ కొనియాడారు. ఈ సినిమాను అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా అనిపిస్తుందని అభివర్ణించారు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చిత్రీకరణ శైలికి తాను ముగ్ధుడినయ్యానని అల్లు అర్జున్ తెలిపారు. చిత్రబృందం మొత్తానికి అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు.

# విజయ్ జన నాయకుడు ఓటీటీలోకి

చెన్నై, ఆగస్టు 18 :

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' డిజిటల్ ప్రసారానికి సిద్ధమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రాజకీయ నేపథ్య యాక్షన్ థ్రిల్లర్ చిత్రం త్వరలోనే డిజిటల్ వేదికపై ప్రేక్షకులను అలరించనుంది. సెన్సార్ సమస్యలు, ఇతర కారణాలతో పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 23న థియేటర్లలో విడుదలైంది. థియేటర్లలో ప్రదర్శన పూర్తికావడంతో ప్రముఖ డిజిటల్ వేదిక జీ5 ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఆగస్టు 21 నుంచి ప్రసారం ఆగస్టు 21 నుంచి 'జన నాయకుడు' జీ5 వేదికగా ప్రసారం కానున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో ఒకేసారి డిజిటల్ ప్రీమియర్ అందుబాటులోకి రానుంది.





# వంటింట్లో సెలబ్రిటీల సందడి

చెన్నై, ఆగస్టు 18 :

సెలబ్రిటీలు, ఆహారం, పోటీ.. ఈ మూడు ప్రపంచాలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రూపొందుతోంది. తమిళ వినోద రంగానికి చెందిన పలువురు ప్రముఖులు తొలిసారి కెమెరాల ముందు నుంచి వంటగదిలోకి అడుగుపెట్టి.. కఠినమైన వంట సవాళ్లు, ఊహించని మలుపులు, ఒత్తిడిని ఎదుర్కోనున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మాస్టర్‌చెఫ్ రూపకల్పన ఆధారంగా ఈ కార్యక్రమాన్ని బనిజె ఏషియా రూపొందిస్తోంది. అయితే తమిళ నేటివిటీకి అనుగుణంగా స్థానిక రుచులు, ప్రేక్షకులకు పరిచయమైన సెలబ్రిటీలు, తమిళ సినీ రంగంలోని ప్రత్యేకమైన అనుబంధాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు డిజిటల్ వేదికలపైనా సందడి 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' సోనీ విళాలో ప్రధాన వినోద కార్యక్రమంగా ప్రసారం కానుంది. సోనీ లివ్‌తో పాటు ఇతర డిజిటల్ వేదికల్లోనూ ఈ కార్యక్రమం అందుబాటులోకి రానుంది. ప్రధాన భాగాలతో పాటు సెలబ్రిటీల వంట ప్రయాణం, వారు ఎదుర్కొనే సవాళ్లు, వంటగదిలో చోటుచేసుకునే ఆసక్తికర ఘటనలను ప్రత్యేక చిన్న వీడియోల రూపంలోనూ ప్రేక్షకులకు అందించనున్నారు. సమంత ఏమన్నారంటే.. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న సమంత మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం తన గత కార్యక్రమాలకు పూర్తిగా భిన్నంగా ఉంటుందని తెలిపారు. అందరినీ ఒకే చోటకు తీసుకురావడంలో, మధురమైన జ్ఞాపకాలను సృష్టించడంలో ఆహారానికి ప్రత్యేకమైన శక్తి ఉందన్నారు.



# నిధి అగర్వాల్ కొత్త సినిమా ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 18 :

టాలీవుడ్ కథానాయకి నిధి అగర్వాల్ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటివరకు చేయని కొత్త తరహా పాత్రలో ఆమె కనిపించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం పౌరాణిక నేపథ్యంతో కూడిన ఉత్కంఠభరిత చిత్రంగా తెరకెక్కనుంది. కథానాయిక ప్రాధాన్యంతో రూపొందుతున్న ఈ సినిమాను 'తంత్ర' చిత్రంతో గుర్తింపు పొందిన శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్నారు. వరాహ ఫిల్మ్స్ పతాకంపై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆ సంస్థకు తొలి సినిమా కావడం విశేషం. నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు చిత్రీకరణతోనే సినిమా షూటింగ్‌ను కూడా ప్రారంభించారు. ఆకట్టుకుంటున్న తొలి రూపం సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన నిధి అగర్వాల్ తొలి రూపం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇందులో నిధి ఒక చేతిలో దీపం పట్టుకుని, మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తున్నారు. ఆమె వెనుక అనేక చేతులతో కూడిన దేవతా రూపం కనిపిస్తోంది. దీంతో సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే సినిమా పేరు ప్రకటన ఇటీవల ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ సరసన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నటించిన నిధి అగర్వాల్‌కు మంచి గుర్తింపు లభించింది. ఇప్పుడు ఆమె చుట్టూ తిరిగేలా దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పేరును అధికారికంగా ప్రకటించన ున్నట్లు తెలుస్తోంది.




# 'ఇరుముడి'లో రామ్‌చరణ్ క్యామియో.. అసలు నిజం ఇదే!

హైదరాబాద్, ఆగస్టు 18 :

మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 21న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు, టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'మల్లెపూల పల్లకి' పాట సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతోంది. అయితే ఈ పాటకు సంబంధించి ఓ ఆసక్తికరమైన ప్రచారం ఇప్పుడు వైరల్‌గా మారింది. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ ఈ పాటలో ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త ఒక్కసారిగా ఊపందుకుంది. రవితేజ, రామ్‌చరణ్ ఒకే తెరపై కనిపించనున్నారనే ప్రచారం ఇద్దరు హీరోల అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. క్యామియోపై స్పష్టత ముఖ్యంగా 'మల్లెపూల పల్లకి' పాటలో రామ్‌చరణ్ ప్రత్యేకంగా కనిపించనున్నారనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు ఈ కలయిక కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం రామ్‌చరణ్ 'ఇరుముడి'లో ఎలాంటి ప్రత్యేక అతిథి పాత్ర చేయడం లేదని తెలుస్తోంది. 'మల్లెపూల పల్లకి' పాటలో ఆయన కనిపించనున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాల సమాచారం. ణ్ కలయికలో ఓ ప్రత్యేక పాట ఉంటుందని భావించిన అభిమానులకు ఈ వార్త కొంత నిరాశ కలిగించింది. ఇద్దరు హీరోలు ఒకే పాటలో కనిపిస్తే థియేటర్లలో భారీ స్పందన వచ్చేదని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. విడుదలకు సిద్ధమైన 'ఇరుముడి' కేవలం ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని రామ్‌చరణ్ ప్రత్యేక పాత్రపై అంచనాలు పెంచుకోవద్దని, చిత్రబృందం నుంచి అధికారిక సమాచారం వచ్చే వరకు వేచి చూడాలని పలువురు సూచిస్తున్నారు. మరోవైపు 'ఇరుముడి' ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467